5, 11, 12 తేదీల్లో బొటానికల్ గార్డెన్‌లో సమ్మర్ క్యాంప్



క్యాంప్‌లో పాల్గొన్న సందర్శకులు

గచ్చిబౌలి: తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ(టీఎస్ ఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో 'సమ్మర్ డే క్యాంప్' నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు ప్రకృతి అందాలను వీక్షించారు. ఉదయం 6 గంటల నుంచి క్యాక్టస్, మూలికావనం మీద ప్రకృతి అధ్యయనం, ఆడియో, వీడియో హాల్ వీక్షణ, నక్షత్ర వనం, రాశివనం, నవగ్రహ వనం సందర్శించారు. జిప్‌లైన్, స్కై సైక్లింగ్, ఆర్చరీ, హైరోప్, కమాండ్ నెట్, స్పైడర్ నెట్, బంగీ ట్రింపోలిన మొదలైన అడ్వెంచర్ యాక్టివిటీలు ఆస్వాదించారు. 50 థీమ్ పార్కులు, 7 పర్యావరణ వ్యవస్థలు, 18 రకాల అడవుల గురించి వివరించారు. క్యాంప్‌లో పాల్గొనే వారు ఒకొక్కరు రూ.499 చెల్లించాల్సి ఉంటుందని, మే 5, 11న, 12న సమ్మర్ డే క్యాంప్ ఉంటుందన్నారు. వివరాల కోసం 9493549399, 9345354583 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని టీఎస్ఎఫ్‌డీసీ అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌ఓ శ్రీనివాస్ రావు, ఏకో టూరిజం ప్రాజెక్ట్ మేనేజర్ సుమన్ బొటానిస్ట్ డాక్టర్ వీర కిశోర్, సూపర్‌వైజర్ శాంసన్‌రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం



కమలమ్మనగర్ కాలనీలో ప్రచారం చేస్తున్న వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించుకోవాలని ఆ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఎల్లమ్మబండ పరిధిలోని కమలమ్మనగర్ కాలనీలో పాదయాత్ర చేస్తూ ఇంటింటికి వెళ్లి హస్తం గుర్తుకే ఓటు వేయాలని కోరుతూ కరపత్రాలను అందజేశారు.

గోపీనగర్‌లో..

శేరిలింగంపల్లి: సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు పార్టీ శేరిలింగంపల్లి ఇంచార్జీ వి.జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని గోపీనగర్‌లో శనివారం ఇంటింటి ప్రచారం చేశారు. ఏ కాలనీకి వెళ్లినా ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు.



ప్రచారం చేస్తున్న జగదీశ్వర్‌గౌడ్ తదితరులు



అభివృద్ధికి నోచని రేడియల్ రోడ్డు

పట్టించుకోరేం..

ఓఆర్ఆర్-30 ఎక్స్‌టెన్షన్ రేడియల్ రోడ్డుపై నిత్యం ప్రమాదాలు

- పదేళ్లుగా అభివృద్ధికి నోచుకోని వైనం
- పలు కాలనీలకు కనెక్టివిటీ
- వెంటనే స్పందించాలని పరిసర ప్రాంత కాలనీలవాసుల వినతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నూతన కాలనీలు ఏర్పాటవడం అందులో ఎక్కువ శాతం ఐటీ నిపుణులు నివాసముంటుండడంతో గత పాలకులు ఫైనాన్షియల్ జిల్లాకు కనెక్టివిటీగా ఓఆర్ఆర్ -30 ఎక్స్‌టెన్షన్ రేడియల్ రోడ్డు పనులను ప్రారంభించారు. శేరిలింగంపల్లి పరిధిలోని గోపన్‌పల్లి తండా నుంచి తెల్లాపూర్, ఉస్మాన్‌నగర్ మీదగా కొల్లూర్ రింగ్‌రోడ్డు జంక్షన్ వరకు సుమారు 7.6 కిలోమీటర్ల మేర రోడ్డును అభివృద్ధి చేశారు. రోడ్డు పనులు ప్రారంభించి సుమారు పదేళ్లు కావస్తున్నా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 30 ఎక్స్‌టెన్షన్ రేడియల్ రోడ్డుపై కంకరా, మట్టి దర్శనమిస్తున్నాయి. నిత్యం ఈ రోడ్డుపై వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దాంతో ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటే హడలిపోతున్నారు.

ప్రమాదాల పరంపర

నిత్యం ఈ మార్గంలో వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. భవన నిర్మాణాలు సైతం పెరగడంతో ఈ మార్గంలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వాటి కారణంగా రోడ్డుపై కంకర రాళ్లు పడడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికే అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. వందలాది మంది గాయలపాలయ్యారు.



రోడ్డుపై కంకర

15 కాలనీల మీదుగా..

ఈ రేడియల్ రోడ్డు సుమారు 15 గెటెడ్ కాలనీల మీదుగా వెళ్తుంది. సుమారు 40 కాలనీలకు కనెక్టివిటీగా ఉంది. నిత్యం రద్దీగా ఉండే రోడ్డును సంవత్సరాల తరబడి అభివృద్ధి చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుతం ఈ రోడ్డు సరిగా లేకపోగా రోడ్డు మధ్యలో డివైడర్‌లు లేకపోవడం, రాత్రి సమయంలో విద్యుత్ దీపాలు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని పాలకులు వెంటనే రోడ్డును అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నిత్యం ప్రమాదాలు



పాలకులు రోడ్డును అభివృద్ధి చేసింది ప్రజల కోసమా లేక రియల్ వ్యాపారుల కోసమా అనేది సమాధానం చెప్పాలి. పేరు ప్రఖ్యాతులు ఉన్న వెంచర్లు ఉంటే అక్కడ రోడ్లను అభివృద్ధి చేస్తున్నారు. నిత్యం ప్రమాదాలు జరిగే ఈ రేడియల్ రోడ్డును మాత్రం అభివృద్ధి చేయడం లేదు. త్వరలో దీనిపై ఉద్యమిస్తాం.

– ఈశ్వర్‌గారి రమణ, తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ అధ్యక్షులు

అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాం



ఓఆర్ఆర్ 30 ఎక్స్‌టెన్షన్ రేడియల్ రోడ్డు విషయంను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. పలుచోట్ల విద్యుత్‌దీపాలను ఏర్పాటు చేశాం. సమస్య పరిష్కారానికి నావంతు కృషి చేస్తాను.

– సంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్, తెల్లాపూర్

బీఈడీ, ఎంఈడీ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: మనూలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ (డీఈఅండ్‌టీ) ఆధ్వర్యంలో బీఈడీ, ఎంఈడీ కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని డీఈ అండ్ టీ హెడ్ ప్రొఫెసర్ షాహీన్ అల్తాఫ్ షేక్ శనివారం తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు యూనివర్శిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తులుంటాయని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పరిమిత సంఖ్యలో హాస్టల్ సౌకర్యం అందుబాటులో ఉందన్నారు. ప్రవేశ ఆధారిత కోర్సులకు దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ మే 20 అని మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్, ఫోన్ నంబర్లు 9618783492, 9959195495లలో సంప్రదించాలని కోరారు.

చిత్ర ప్రదర్శనలు ప్రారంభం





మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో శనివారం రెండు చిత్ర ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. చిత్రకారుడు శ్రీహర్ష కాటూరి వేసిన యానిమల్ థీమ్‌తో స్కల్ప్చర్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ నెల 13వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రదర్శనలో 17 వర్క్‌లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అలాగే ఆర్ట్‌గ్రూప్ షో– 2024 పేరిట 26మంది కళాకారులు వేసిన 40 పెయింటింగ్‌లను ప్రదర్శించారు. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

ఆత్మీయ సమావేశం



శేరిలింగంపల్లి పాస్టర్స్‌తో సమావేశమైన ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో పాస్టర్స్‌తో శనివారం జరిగిన ఆత్మీయ సమావేశంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాస్టర్స్ బీఆర్‌యస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపు కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ క్రైస్తవ సమాజం కోసం కేసీఆర్ ఎంతో పాటుపడ్డారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



టీఎన్‌జీఓ కాలనీలో ప్రచారం చేస్తున్న మాజీ కార్పొరేటర్ సాయిబాబా

గచ్చిబౌలి: సమగ్ర అభివృద్ధి మాజీ సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా అన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని టీఎన్‌జీఓ కాలనీలో బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారాన్ని శనివారం నిర్వహించారు. అంతకు ముందు స్థానిక దేవాలయంలో బీఆర్ఎస్ నాయకులు పూజలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు మాజీ వార్డు, ఏరియా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాదాపూర్ డివిజన్ పరిధిలో..

హఫీజ్‌పేట్: బీఆర్ఎస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ తరపున శనివారం మాదాపూర్ డివిజన్ పరిధిలో ఆదిత్యనగర్ కాలనీలలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ప్రచారం చేశారు.

ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో..

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జై భారత్‌నగర్, బృందావనం కాలనీల్లో చేవెళ్ల పార్లమెంట్ బీఆర్‌యస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు కోసం హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు, నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేసేది బీఆర్‌యస్‌యే అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నీటి , కరెంటు కష్టాలు మొదలయ్యాయని విమర్శించారు.

బీఆర్ఎస్‌కు రికార్డు మెజార్టీ అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి రికార్డు మెజార్టీ అందించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు.బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని వేదిరి టౌన్‌షిప్, హెచ్ఎంటీ కాలనీ, పీజెఆర్ ఎంక్లేవ్, సాయిఅంబిక కాలనీ, శ్రీవాణీ నగర్, జన్మభూమి ఫేజ్ 2 తదితర కాలనీలలో పర్యటించి, ఆయా సంక్షేమ సంఘాల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో పటాన్‌చెరు నియోజకవర్గాన్ని రూ.9 వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. అమీన్‌పూర్ మేజర్ గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు, మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామని తెలిపారు. ఎన్నికల్లో ఓటు వేయాలని అడిగే కాంగ్రెస్ నాయకులను ఆరు గ్యారంటీల హామీలపై నిలదీయాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహగౌడ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో క్యూఆర్ కోడ్ స్కాన్ తో వైద్య సేవలు

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వాసుపత్రిలో క్యూఆర్ కోడ్‌స్కాన్‌తో వైద్య సేవలు పొందవచ్చని సూపరింటెండెంట్ డాక్టర్ వసుంధర అన్నారు. శనివారం ప్రభుత్వాసుపత్రిలో క్యూఆర్ కోడ్ ఆధారిత స్కానర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ వసుంధర మాట్లాడుతూ... ఆస్పత్రికి వచ్చే రోగులు ఓపి స్లిప్పుల కోసం లైన్ లో వేచి ఉండాల్సిన అవసరం లేదని, నిరీక్షణ సమయాన్ని తగ్గించేందుకు క్యూఆర్ కోడ్ స్కానర్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎం డాక్టర్ ప్రవీణ, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ దివాకర్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్ స్కానర్‌ను ప్రారంభించిన వైద్యులు

ద్విచక్ర వాహనాల దొంగల అరెస్ట్

20 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

మియాపూర్: జల్సాలకు అలవాటుపడి ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను మియాపూర్ పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సిఐ దుర్గా రామలింగప్రసాద్, డీఐ అక్రమ్ బాబా తెలిపిన వివరాల ప్రకారం ...ప్రకాశం జిల్లా వడ్డేపాలెం గ్రామానికి చెందిన తమ్మిశెట్టి నాగరాజు(28), సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లోని భవానీపురం కాలనీలో ఉంటూ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ లింగమయ్య కాలనీకి చెందిన పెద్దపూడి శివసాకేత్ అలియాస్ చంటి (21) ఇద్దరు స్నేహితులు. వీరికి వచ్చే డబ్బులు చాలక కొన్ని సంవత్సరాల నుంచి మెట్రో పార్కింగ్, ఇతర పార్కింగ్ ప్రదేశాల్లో ద్విచక్ర వాహనాలను దొంగిలించి ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్, శ్రీశైలంలో అమ్మి వచ్చిన డబ్బులతో జల్సాలకు పాల్పడుతుండేవారు. సైబరాబాద్, హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్‌ల పరిధిలో వీరిపై 20 కేసులు నమోదై ఉన్నాయి. ఈ క్రమంలో శనివారం పోలీసులు మియాపూర్‌లో వాహనాల తనిఖీలు చేస్తుండగా తమ్మిశెట్టి నాగరాజు, శివసాకేత్‌లు వెళ్తుండగా పోలీసులు వారిని అనుమానించి అదుపులోకి తీసుకుని విచారించగా ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించారు. దీంతో ఇరువురిని అరెస్ట్ చేసి, వారు దొంగిలించిన 20 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు

కొండా విశ్వేశ్వర్‌రెడ్డికే ప్రజల మద్దతు



శేరిలింగంపల్లిలో ప్రచారం చేస్తున్న కొండా విశ్వేశ్వర్ రెడ్డి సతీమణి సంగీతారెడ్డి

గచ్చిబౌలి: చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికే ప్రజల మద్దతు ఉందని ఆయన సతీమణి కొండా సంగీతారెడ్డి పేర్కొన్నారు. కొండాపూర్‌లోని సిద్దిఖీనగర్, అంజయ్యనగర్‌తో పాటు పలు ప్రాంతాలలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నరేంద్ర మోదీ పాలనను ప్రజలు కోరుకుంటున్నారని, దేశ భవిష్యత్ కోసం మోదీ అవసరమని ఆమె అన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కొండా అభిమానులు పాల్గొన్నారు.

హోమ్ ఓటింగ్ ప్రారంభం



గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ప్రారంభమైన హోమ్ ఓటింగ్‌ను నియోజకవర్గ ఏఆర్‌ఓ, వెస్ట్ జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్ పరిశీలించారు. శనివారం పలు ప్రాంతాలలో హోమ్ ఓటింగ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ వరకు హోమ్ ఓటింగ్ కొనసాగుతుందన్నారు. 85 సంవత్సరాలు నిండిన వృద్ధులు, వికలాంగుల కోసం ఇంటి వద్దే ఓటింగ్ వేసే అవకాశం ఉందని, ఈ హోమ్ ఓటింగ్ కోసం ఎనిమిది బృందాలు పని చేస్తున్నాయని తెలిపారు. అనంతరం జోనల్ కార్యాలయం ఆవరణలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను పరిశీలించారు.

బీఆర్ఎస్ నాయకుల పూజలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతీనగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి సతీమణి ప్రణీత రెడ్డి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సతీమణి యాదమ్మ, కార్పొరేటర్‌లు సింధు రెడ్డి, పుష్ప, తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లలితారెడ్డి పాల్గొన్నారు. అనంతరం కాలనీలలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో డివిజన్‌లో జరిగిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి ఓటు వేయాలని కోరారు. మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు అదర్శ్‌రెడ్డి, ఐలేష్, పరమేష్‌లు పాల్గొన్నారు.

అలరించిన త్యాగరాజ కృతులు



మాదాపూర్: కళాకారులు త్యాగరాజ కృతులు, పంచరత్న కీర్తనలతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం సాంప్రదాయ సంస్థ ఈశ్వర్ ప్రసాద్ శిష్యబృందం జగదానంద కారక సద్గురు త్యాగరాజ జయంతి ఉత్సవాన్ని నిర్వహించారు. శ్రీరామ్ జొన్నలగడ్డ శిష్యబృందం త్యాగరాజ కృతులు, పంచరత్న కీర్తనలు ఆలపించారు. వీరికి వయోలిన్ వాసుశాస్త్రీ, మృదంగం కృష్ణశ్రావణ్, అరవింద్, భార్గవ్, కీ బోర్డుపై సుమేధ్‌లు సంగీత సహకారాన్ని అందించారు. నగరంలో ఉన్న సంగీత గురువులు పాల్గొన్నారు.

జూన్ 18న సౌత్ ఇండియన్ వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్

హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ హెడ్ టీజీ శ్రీకాంత్

గచ్చిబౌలి: సౌత్ ఇండియన్ వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్ మూడో ఎడిషన్, టీసీఈఐ ఈవెంట్ ఎక్సలెన్స్ అవార్డుల పంపిణీ నిర్వహిస్తున్నట్లు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ హెడ్ టీజీ శ్రీకాంత్ తెలిపారు. శనివారం కొండాపూర్‌లోని మాయా కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో తెలంగాణ చాంబర్స్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ(టీసీఈఐ) ఆధ్వర్యంలో జూన్ 18, 19న సౌత్ ఇండియన్ వెడ్డింగ్ ప్లానర్స్ కాంగ్రెస్, టీసీఈఐ అవార్డుల పంపిణీ ఉంటుందన్నారు. భారతీయ వివాహ పరిశ్రమలోని నిపుణులను ఒకే వేదికపైకి తీసుకొస్తున్నామని చెప్పారు. ఈవెంట్స్ బజార్ పేరిట 60 స్టాల్స్‌లో అత్యాధునిక ట్రెండ్స్‌ను ప్రదర్శిస్తారు. జూన్ 19న టీసీఈఐ ఈవెంట్ ఎక్సలెన్స్ అవార్డుల పంపిణీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీసీఈఐ అధ్యక్షుడు బలరాం బాబు, ప్రధాన కార్యదర్శి రవి బూర, కోశాధికారి ఎండీ తౌఫిక్ ఖాన్, కన్వీనర్ సాయి శ్రవణ్ మాదిరాజు, టీసీఈఐ ఈవెంట్ ఎక్సలెన్స్ అవార్డ్స్–2024 కన్వీనర్ రామ్ కే ముప్పన, కో కన్వీనర్లు హరీష్ రెడ్డి, కుమార్ రాజా, డాక్టర్ సౌరభ్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హెడ్ టీజీ శ్రీకాంత్, టీసీఐ ప్రతినిధులు

పోషకాహారంతోనే ధృఢత్వం



మిల్లెట్స్ మార్వెల్స్ ప్రారంభోత్సవంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

బండ్లగూడ: అధిక పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకున్నప్పుడే దృఢంగా ఉంటారని మిల్లెట్ మార్వెల్స్ మెంటర్, గైడ్ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ డాన్‌బాస్కోనగర్‌లో మిల్లెట్ మార్వెల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మిల్లెట్ ఎక్స్‌పీరియన్స్ హబ్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహారాన్ని ప్రజలకు అందించాలన్న ఉద్దేశంతో భారత్‌లో మొదటి హబ్‌ను ఏర్పాటు చేశారన్నారు. గ్లోబల్ సెంటర్లు ఐఐఎంఆర్, న్యూట్రీహబ్‌తో కలిసి అభివృద్ధి చేసిన మొదటి మిల్లెట్ చాట్‌ను ఈ హబ్ అందిస్తుందన్నారు. వరుసగా మూడేళ్లుగా భారత ప్రభుత్వం నుంచి పోషక అనాజ్ అవార్డు కూడా అందుకుందని తెలిపారు. చేవెళ్లలాంటి వర్షాభావ ప్రాంతాల వారు మిల్లెట్స్ సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చని సూచించారు. యువ పారిశ్రామికవేత్తలు మిల్లెట్స్ సాగు ఎగుమతులపై దృష్టిసారించాలని కోరారు. కార్యక్రమంలో మిల్లెట్ మార్వెల్స్ ఫౌండర్ డాక్టర్ భరత్‌రెడ్డి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శోభక్క, అంజన్‌కుమార్‌గౌడ్, మల్లారెడ్డి, మహేశ్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



రంజిత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన వెంకట్ నాయక్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి సమక్షంలో శనివారం డివిజన్ బీఆర్‌యస్ పార్టీ ఎస్‌టీ సెల్ అధ్యక్షుడు వెంకట్ నాయక్ తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, యువనేత రామకృష్ణగౌడ్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వెంకన్న, మల్లేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

పటాన్‌చెరు టౌన్: బెల్ట్‌షాపలపై అమీన్‌పూర్ పోలీసులు దాడులు చేసి 37 లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ సోమేశ్వరి కథనం ప్రకారం...అమీన్‌పూర్ మండల పరిధిలోని ఐలాపూర్ తండాకు చెందిన రమేష్, ప్రకాశ్‌చంద్‌లు శనివారం మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం రావడంతో ఎస్ఐ , సిబ్బందితో కలిసి దాడులు చేసి రెండు చోట్ల 37 లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకున్నారు. మద్యం విక్రయిస్తున్న రమేష్ , ప్రకాష్ ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మాదాపూర్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. మాదాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిఖీనగర్ రోడ్ నంబర్ 14లో ఓ వ్యక్తి (30) అపస్మారక స్థితిలో పడి ఉండగా పోలీసులు 108కి డయల్ చేసి కొండాపూర్ ఆసుపత్రికి తరలించారు. కొండాపూర్ డాక్టర్లు మెరుగైన చికిత్సకోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. ఎత్తు 5 అడుగులు, చామనఛాయ, ఉంగరాల జుట్టు, నలుపు, తెలుపు రంగు చారల షర్టు ధరించినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో..

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... అమీన్‌పూర్ మండల పరిధిలోని బొమ్మనుకుంటకు చెందిన ఎర్రోళ్ల శ్రీనివాస్(36) పెయింటర్. శుక్రవారం మధ్యాహ్నం పని ముగించుకుని బీరంగూడ నుంచి జానకంపేట వైపు ద్విచక్ర వాహనంపై వేగంగా వస్తూ బీరంగూడ బచ్‌పన్ స్కూల్ సమీపంలో డివైడర్‌ను ఢీకొన్నాడు. తీవ్ర గాయాలైన శ్రీనివాస్‌ను చికిత్స కోసం అశోక్‌నగర్ లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు చంద్రయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్పెషల్ డ్రైవ్.. కేసులు నమోదు

మియాపూర్: ప్రధాన రహదారిపై యూటర్న్‌ల వద్ద రాంగ్‌రూట్‌లో వస్తున్న 9 మంది ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్‌పై మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. శనివారం మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ ఆధ్వర్యంలో రాంగ్ సైడ్ డ్రైవ్ అండ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తే చలాన్లతో పాటు ఎఫ్ఐఆర్ బుక్ చేసి ఐపీసీ సెక్షన్–336 కింద కేసు నమోదు చేస్తామని ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ తెలిపారు.